# ప్రణాళిక

ద్యుమణి ఒంటరిగా గదిలో పడుకుని యోచిస్తున్నాడు నిన్నటి విషయమై కానీ ఏమీ పాలుపోవడం లేదు.

"టక్ టక్ టక్" తలుపు చప్పుడు.

"తలుపు తీసే ఉంది.... లోపలికి రండి" అన్నాడు బిగ్గరగా.

ఇద్దరు పెద్దమనుషులు లోపల అడుగు పెడుతూ "ద్యుమణి అంటే ఎవరు నాయనా?" అనడిగేరు.

ద్యుమణి ఒక్కసారి తుళ్ళిపడ్డాడు.!!

కొంచెం ధైర్యం తెచ్చుకుని "నేనే" అన్నాడు.

"నువ్వా బాబూ!" అన్నాడొకాయన "నిన్నటి సంగతేమైనా తేల్చుకున్నావా?" అన్నాడింకో అయన.

ద్యుమణి అటూ ఇటూ చూసి "లేదు" అన్నాడు.

"ఏం చేద్దామనైతే నీ ఉద్దేశ్యం? ఏదో ఒకటి తేల్చకపోతే నువ్వు చాలా చిక్కుల్లో పడాల్సొస్తుంది! అమ్మాయి భోరుమంటోంది. దాని జీవితాన్ని నాశనంచేశావు...."

"నోరు ముయ్యండి!" అన్నాడు ద్యుమణి... ఇంకా మీరు మీ అమ్మాయి పేరు చెప్పి నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యకండి...మీ దిక్కున్న వాడితో చెప్పుకోండి!" దబాయించాడు ద్యుమణి.

"బాగా ఆలోచించుకో! ఇంత సులభంగా నిన్ను విడిచి పెట్టము ద్యుమణీ! మా పరువు పోనే పోయింది. నీ వల్ల జరిగిన ఈ ఘోరాన్ని గురించి ఊరంతా ప్రాకనే ప్రాకింది. ఇంక చట్టపరమైన చర్య తీసుకోవాల్సుంటుంది. మరో సారి ఆలోచించు. ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నావా సరే! లేకపోతే..." అని హెచ్చరించి వెళ్ళిపోయారు.

ద్యుమణి అవాక్క యిపోయాడు! గబగబా వెళ్ళి కిటికీ తలుపులు మూసేశాడు...యథాతథంగా పడక్కుర్చీలో కూలబడ్డాడు.

అవును నిజం! ఇప్పుడా వ్యోమకేశం గార మ్మాయికి తనవల్లే నెల తప్పింది.... ఆమె చెబుతూనే ఉంది పెళ్ళయ్యాక ఆపని చెయ్యొచ్చునని.... అయితే ఆ మాటలు ద్యుమణి కర్ణరంధ్రాల్లోకి దూసుకువెళ్ళ లేదు. ఒకరకంగా బలవంతం చేశాడు కూడా. అయినా తనకేకాదు... ఎవరికైనా అంతేనేమో! అనుభవం పొందిన తరువాత దాంట్లో సాధక బాధకాలు తెలుస్తాయి... అందుకే అన్నారు పెద్దలు 'కామాంధానో వివేకో నాస్తి' అని.

ఆలోచిస్తూ ఉండిపోయాడు ద్యుమణి.

పోని పెళ్ళి చేసుకుందామా అంటే అతనికి ఆ అమ్మాయి నచ్చ లేదు. ఏదో

ఆసమయానికి ఆమె కనిపించింది. మొదటినుంచి తనకామెను పెళ్లిచేసుకునే ఉద్దేశ్యం మాత్రం లేదు. అవసరం గడిస్తే చాలనుకున్నాడు. మాయలో పడింది. తను చేసిన నీచ కార్యానికి మాత్రం ఆమె యంత్రంగా పని చేసింది. ససేమిరా ఆమె తనకు అర్ధాంగి కారాదనుకున్నాడు.

మర్నాడు మళ్ళీ నిన్నవచ్చిన వారిలో ఒకాయన వచ్చాడు....

"ఏమిటి మీరింతకీ అనేది?" అన్నాడు ద్యుమణి.

"అమ్మాయిని పెళ్ళి చేసుకోడం!" సూక్ష్మంగా చెప్పేశాడాయన...

"అది మాత్రం జరిగే పనికాదు!" కరాఖండీగా చెప్పేశాడు ద్యుమణి...

ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేశారు.

"అబ్బాయీ! నువ్వు వ్యోమ. కేశంగార మ్మాయిని పెళ్ళి చేసుకోకపోతే మేమే నీకు 'పెళ్ళి' జరిపిస్తాం. స్కానింగ్. డి. ఎన్. ఎ. మొదలైన పరీక్షలు జరిపితే ఆ అమ్మాయి నీ వల్లనే తల్లికాబోతోందని తెలిపోతుంది. అప్పుడు నీ పేరు ద్యుమణి కాక 'ఖైదీ రుద్రయ్య' అవుతుంది జాగ్రత్త!" అని హెచ్చరించారు.

ద్యుమణి మెత్తబడ్డాడు. నెల రోజుల్లో వివాహ సుముహూర్తం నిర్ణయమైంది.

అశేష బంధుమిత్ర జన సందోహంతో కల్యాణ మండపం కళకళలాడుతోంది.

సుముహూర్తానికి 'జీలకర్ర బెల్లం' ఒకరి తలలపై ఒకరు పెట్టుకునేవేళ సమీపిస్తుంటే ద్యుమణి గాబరా పడిపోతూ తన మిత్రుల వంక చూస్తూ "ఏమిటైంది?" అన్నట్లు చేతోసంజ్ఞలు చేస్తున్నాడు. తన మిత్రులు "ఏమీ అవలేదు" అన్నట్లు తిరిగి సంజ్ఞలు చేస్తున్నారు.

సుముహూర్తానికి జీలకర్ర బెల్లం మంగళ. ధ్వానాల మధ్య ఒకరి తలలపై ఒకరు మెత్తుకున్నారు. మరికొంత సేపటికి మంగళసూత్రం కూడా వధువుగళం చుట్టూ కట్టక తప్పింది కాదు ద్యుమణికి... పెళ్ళి తంతు అంతా వీడియో తీశారు. కెమెరాలు క్లిక్కుమన్నాయి.

ఇంతకీ ద్యుమణి వేసిన ప్రణాళిక ఏమిటంటే తన మిత్రులు పది మందికీ వెయ్యి రూపాయలు చొప్పున కొట్టించేసి పెళ్ళి పందిట్లో "ఈ పెళ్ళి కొడుక్కి ఇదివరకే పెళ్ళయింది వీడు వట్టి మోసగాడు!" అని ముక్తకంఠంతో అరవమన్నాడు. పదుగురాడుమాట పాటియై ధర చెల్లుతుందని. అంతటితో పెళ్ళి ఆగిపోతుందని ద్యుమణి పథకం! కానీ అతని మిత్రులకి పెళ్ళి కూతుర్ని మోసంచేయడం 'మనస్కరించక' చల్లగా ఊరుకున్నారు. వారిలో అంతర్లీనంగా దాగిన మానవత్వం ఆ దుష్టకార్యం చెయ్యనివ్వలేదు. నూరేళ్ళ పంట ఒక పెను తుఫానుతో నాశనం కారాదని భావించారు ఆ సుమనస్కులు!

అలా పాపం ద్యుమణి పెళ్లి తప్పించుకోవడానికి చివరిసారిగా వేసుకున్న ప్రణాళిక తలక్రిందులైంది. . డబ్బూ పోయింది. మిత్రులు ఒక్కరంటే ఒక్కరు పదిపైసలు తిరిగి ఇవ్వలేదు. తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనక ఉండిపోయాడు.

15-7-2001

ఆదివారం ఆంధ్రప్రభ దినపత్రిక